# మునిమాపుకే మాడుమల్లెల్లా

కె. వివేకానందమూర్తి

"బాబుగోరు నాకేటనొచ్చిందేటియ్యాల!"

వీధి అరుగుమీద కూర్చుని వుత్తరాలకట్టని పరిశీలిస్తున్న విశ్వనాధాన్ని, అరుగు దిగువ అనింటా నిలబడి ఆసక్తిగా అడిగింది కనకాలు.

"రోజూ యినే వరస నీకు! ఎక్కణ్ణించి వూడిపడతావోగాని. ఈ అరుగుమీద పడమటింట బడ్డం తరువాయి - టపా యిలా వచ్చేసరికి తకీమని సిద్ధమౌతవ్. వస్తే నే పిలిచి చెప్పనూ?" విసుగ్గాచెప్పి, విశ్వనాధం మళ్ళీ వుత్తరాలు చూసుకోవడంలో మునిగిపోయేడు.

"అఁ - మీ రెప్పుడూ నేదునేతన్న పలుకేగా! కొత్తేటి పలుకు సంబరం! ముక్కెర వణికేలా మూతి విరుచుకుని కనకాలు నిరాశగా కదిలింది.

విశ్వనాధం తలెత్తి చూసేడు. క్షణంసేపు అతని మనస్సులో, ఆలోచనలు చెదిరేయి- ఏమిటి దీనికీ తాపత్రయం? ఎందుకిలా చలించని ఆశపట్టుకుని దేవుళ్ళాడుతుంది. ఎందుకిలా రోజుకో కొత్త వుత్సాహానికీ, కొత్త నిరుత్సాహానికీ సిద్ధపడుతుంది? ఆ రోజు ఈ కనకాలుకి తనే ప్రభుత్వం పంపిన టెలిగ్రాముని చదివి చెప్పాడు. సరిహద్దులో యుద్ధభూమిలో ప్రవేశించిన దాని బావ జాడ తెలియడం లేదని, ఆ వార్త విన్నక్షణం కనకాల్లో కంగారు పరుగులుతీసి, భయంతో బెంబేలు పడిపోయింది. దాని నొసట చెదిరిన కుంకుమ చూశ్నాక తన మనస్సూ చెదిరిపోయింది. కొసకి, నిజం చెప్పే ధైర్యం లేక తను కనకాలుకి చెప్పాడు. దాని బావ తప్పక తిరిగి వస్తాడని చెప్పాడు. కాని, కనకాలు బావ దేశం కోసం చచ్చిపోయేడని తన కానాడే తెలుసు. గుర్తుతెలియని జవానుల మరణవార్తల్ని ప్రభుత్వం అలాగే తెలియజేస్తుంది. పాపం! బావ తనకోసం నిజంగా తిరిగివస్తాడనుకుంటోంది. అందుకే రోజూ వుత్తరాలకోసం వుబలాట పడుతుంది. రోజూ యిలా దాని అమాయకత చూస్తూంటే కడుపు తరుక్కు-



పోతుంది. నిజమే మరి! బావ బ్రతికున్నప్పుడు యిరవై ఏళ్ళ కనకాల్లో చాలాసార్లు సిగ్గు దొంతర్లు దొర్లడం తను చూశాడు. నాగరికత తెలీని వ్యక్తిలో, ఆ విధంగా నాగరికతతో ప్రమేయంలేని సిగ్గునీ, వేడి భావాల్నీ చూడ్డం తనకొక చక్కటి అనుభూతిలా వుండేది. ఇప్పుడా అనుభూతి కాస్తా కరువైంది. చివరికి జాలి మిగిలింది. ఇక తన కోసం పోరాడి నందుకు కృతజ్ఞతగా, అతడి భార్యకి పసుపు కుంకుమల్ని మిగల్చడంలో దేశానికి తనూ కాస్త చేతనైన సహాయం చెయ్యగలిగాను కదా అని మాత్రం అనిపిస్తోందిప్పుడు. ఏమైనా, కనకాల్లో మరీ యింత అమాయకతా! బావ చావుని తను ఆపాటి వూహించుకో లేదూ? పిచ్చి కనకాలు—

ఇలా, ఎన్నో రోజులుగా కనకాలు అడిగే మార్పులేని ప్రశ్నలో ఆశనీ, అతృతనీ— ఎన్నో రోజులుగా మారని తన జవాబుకి కనకాలు విసిరే నిష్ఠూరంలో నిరాశనీ, నిస్పృహనీ—గమనిస్తున్న విశ్వనాథం నరాల్లో ప్రతిరోజూ ఆవేళప్పుడు జాలి వాహినిలా ప్రవహిస్తుంది.

విశ్వనాథానికి యించుమించు ముప్ఫైఏళ్ళ వయసుంటుంది. పెద్ద కళ్ళు, పెద్ద ఛాతీ- భార్యకి తగిన భర్త. మనిషి బావుంటాడు. బి. ఏ. కోసం రెండేళ్లు చదివేక డిగ్రీ వచ్చింది. వుద్యోగంకోసం నాలుగేళ్లు తిరిగేక విసుగొచ్చింది. తను వెనక్కి వచ్చేసేడు. విశ్వనాథం అప్పట్నుంచీ తండ్రి ఆదేశ ప్రకారం, ఆయన వదిలిపోయిన పొలాన్ని, బ్రాంచి పోస్టుమేష్టరు పోస్టుని చూసుకుంటూ, కుగ్రామమైన స్వగ్రామంలోనే యింటిపట్టునే అంటిపెట్టుకుని వున్నాడు. ఊళ్లో చదువురాని కనకాల్లాంటి వ్యక్తులకి తండ్రిలాగే తరచూ అతను వుత్తరాలు రాసిపెట్టడం, చదివిపెట్టడం లాంటివి చేస్తుంటాడు. అలా చేస్తున్నప్పుడు చాలాసార్లు, మంత్రిగారి పర్సనల్ సెక్రటరీ పదవి తనకి లభించినట్లు కలవచ్చి, విశ్వనాథానికి వొళ్ళు గర్వంగా గగుర్పొడిచేది,కాని కనకాలుకి ఆఖరి సమాచారం చదివిపెట్టేక విశ్వనాథం వొళ్లు అలాగ గగుర్పొడవడం మానేసింది.

కనకాలుకి మొగుడంటే తెలియని వయస్సులో పెళ్ళి జరిగిపోయింది. మొగుడంటే తెలిసే సమయానికి దాని మొగుడు కాస్తా మిలిటరీలో చేరిపోయేడు. కాబట్టి కనకాలు తన మొగుణ్నింత వరకూ "నాగులుబావ"లా తప్ప, మొగుళ్ళా చూడలేకపోయింది. యిప్పుడంచేత, దాని ధ్యాస ఎప్పుడూ నాగులు బావ మీదే వుంటోంది. తనకి ప్రపంచం తెలియని వయస్సులో నాగులు బావతో గడిచిన క్షణా లన్నీ యిప్పటి కనకాలు ఎప్పుడూ నెమరు వేసుకుంటూనే వుంటుంది. బావా, తనూ- మెత్తటి చెంగల గడ్డిమీద పందాలు వేసుకుంటూ దొర్లడాలు, బొగడ చెట్టు నీడలో బువ్వాలాటలు, వాక డొంకల్లో దాగుడు మూచీలు కనకాలుకి అప్పటికంటే యిప్పుడే మరీ తియ్యగా వున్నాయి. అనుభవంకంటే అనుభవం గుర్తు అందగించడం సహజం. పోయిన మార్గశిరంలో పంట జాతరప్పుడు, నాగులు బావ త్వరగా తిరిగి వచ్చేలా చూడమనీ, మనువు సార్థకం చెయ్యమనీ ఒనువులమ్మకే కనకాలు భక్తిగా మొక్కుకుంది. తన మాటల్ని లెక్కించకుండా రక్కస కంపల్ని తొక్కుకుంటూ చెట్టెక్కి, తనకోసం పుల్లరేగిపళ్ళుకోసి తెచ్చిపెట్టే నాగులు బావ ధైర్యం కనకాలుకి చిన్నప్పుడే బాగా తెలుసు. అందుకే, యుద్ధానికి వెళ్ళిన బావ ధీరుడై తప్పక తిరిగి వస్తాడని కనకాలుకి గట్టి నమ్మకం వుంది.

అడుగులో అడుగు వేసుకుంటూ యింటి దారి పట్టిన కనకాలుకి, కరణంగారి యింటి మలుపులో పువ్వువెలగచెట్టు పున్నమి పూసు కున్నట్టు కనపడింది. చెట్టు దగ్గిరిసా నడిచేసరికి వెలగపూల సువాసన గుప్పుమంది. కనకాలు ముచ్చటపడింది. క్రిందికి వాలిన లేతకొమ్మని అందుకుని, తల్లో తురుముకోవాలని తెల్లటి వెలగపువ్వొకటి తుంపబోయింది. కాని గోరు అనగానే రేకలు రాలిపోయేయి.

"రారా! నీకుత్తరం వచ్చింది."

హఠాత్తుగా వెనకనుంచి విశ్వనాథం పిలుపు

వినబడ్డంతో, కనకాలు తటాలున తిరిగిచూసింది. విశ్వనాథం రమ్మని చెయ్యి కదుపుతూ కనిపించేడు.

ఒక్క వుదుటున లేగదూడలా పరుగు దీసి ఒక్క క్షణంలో అరుగుదగ్గరకొచ్చి ఆగింది– "నాగులదా వృత్తాంతం– పదండిబాబూ! పదండి! వేగి పదండి!" విప్పారిన కళ్ళతో చూస్తూ కనకాలు గబగబా మాట్లాడింది. మాటల్లో ఆత్రం. దాని ఆయాసాన్ని దాచివేసేందుకు ప్రయత్నించినట్టుంది.

"ఎంతయిందే ముఖం?" విశ్వనాథం ఉత్సాహంగా కదపచింపేడు.

"పదండి! పదండి!" కనకాలు తన్ని మరో పారి వేగిరపరచింది.

విశ్వనాథం మడిచిన కాగితాన్ని విప్పాడు–

ప్రియమైన కనకాలుకి,

నువ్వు క్షేమంగా వున్నావని తలుస్తాను. ఈ మధ్య నేను చాలా కష్టాలు పడ్డాను. యుద్ధంలో శత్రువులి చేతికి ఖైదీగా చిక్కాను. ఆఖరికి, రెణ్నెల్లపాటు యమయాతన అనుభవించాక విడుదల చేయబడ్డాను. మళ్ళా నేను దేశంచూస్తా ననుకోలేదు. తిరిగి మన గడ్డమీద కాలు పెట్టాక జన్మెత్తినట్టయింది. మన సిపాయిలు నేను చచ్చిపోయాననుకుని ప్రార్థనలు చేశారట. అంతా నా చుట్టూ మూగి యీ సంగతి చెబుతూ ఒకటే నవ్వు. ఇప్పుడు జైల్లో బాధలన్నీ మరచిపోయాను. నీ కోసమే బ్రతికానా అనిపిస్తోంది. నువ్వు చాలా ఎదిగిపోయి వుంటావు! ఎంత అందంగా తయారయ్యావో ఏమో. నిన్ను చూడాలని తహతహలాడుతున్నాను. రెక్కలుంటే ఎగిరొచ్చేసే వాణ్ణి. సెలవు దొరికింది. అప్పుడే కలకత్తా దాకా వచ్చేను. రేపు రాత్రే యిక్కణ్నుంచి బయల్దేరబోతున్నాను. బుధవారం పొద్దుగూకే సరికల్లా బెజవాడ చేరుకుంటాను. కాబట్టి ఎల్లుండి సాయంత్రానికల్లా నువ్వు మనూర్నించి బండితోలుకుని స్టేషనుకి రావాలి. చీకటివేళ



వీతో కబుర్లుచెబుతూ బండిప్రయాణంచేసి చాలా రోజులైంది. తప్పకుండా వస్తావు కదూ?

సీ,
నాగులు.

చదవడం ముగించిన విశ్వనాథం అమితంగా ఆనందపడ్డాడు, ఆశ్చర్యపడ్డాడు. ఉత్తరం లోంచి తలెత్తి, నిర్మలమైన కళ్ళతో నిశితంగా కనకాలు ముఖంలోకి చూసేడు. అన్నెం పున్నెం ఎరుగని అమాయకమైన దాని ముఖంలో తెగనిసంతోషం మజిలీ చేసినట్టుంది. తనెరుగని చదువునీ, సంస్కారాన్నీ, దేశసేవనీ, తన కోసం దాచుకున్న ప్రేమనీ, ప్రఫుల్లతనీ, వుత్సాహంతో గొనివస్తున్న నాగులు తన బావ అయినందుకు గర్వపడుతున్నట్టుగా కనకాలు తల చిత్రంగా కదిలింది, దాని జూకాలు కూడా వుల్లాసంగా వూగులాడినట్టు, అటూ ఇటూ ముచ్చటగా వణికేయి. నుదుట చందపు బొట్టు నీరెండపడి నక్షత్రంలా మెరిసింది. అప్పుడు కనకాలు పెదాలనడుమ నవ్వు పువ్వులాంటి నవ్వునృత్యంచేసి, అలసినిలిచింది.యీదృశ్యం విశ్వనాథానికి మధురాతి మధురంగా తోచింది.

"ఇయ్యేల బుదారవేఁ కదుబాబూ?" - వుక్కిరి బిక్కిరయిన భావాల్ని ఒక్కసారిగా తొక్కిపెట్టుకుని కంగారుగా అడిగింది.

అవునని విశ్వనాథం సమాధానం చెప్పే లోపునే, కనకాలు వొంట్లో కదలికలు విజృంభించేయి. మరులిప్తలో తటాలున వెనుదిరిగి బండి నాగన్న ఇంటికేసి పరుగు లంకించుకొంది.

ఊహించరాని శుభం జరిగిందని విశ్వనాథం ఎంతగానో ఊరట పొందేడు, మనస్సు స్తిమితానికి జరిగేక, ఒకసారి తృప్తిగా నిట్టూర్చి మెల్లగా తన కార్యక్రమములో మునిగేడు.

—వున్నట్టుండి వెయ్యి గొంతుల రోదన గుండెలో ప్రతిధ్వనించినట్టయింది.

—క్షణంసేపు మస్తిష్కమంతా ఆలోచనల వేడికి ఆవిరైపోయినట్టయింది.

ఎలాగో కాస్సేపటికి విశ్వనాథం నెమ్మదిగా తేరుకోగలిగేడు.

చెమట పట్టిన ముఖాన్ని వుత్తరీయంతో తుడుచుకొంటూ—ఆ రోజుసాయంత్రం వుత్తరాలతోపాటు వచ్చిన, మర్నాటి బెజవాడ దిన పత్రికలోకి మరోసారి చూసేడు-

హెడ్‌లైన్స్‌లో రాసుంది-

కలకత్తా నుండి మద్రాసువెళ్ళే మెయిలుకి ఉల్బేరియా సమీపంలో ఘోరప్రమాదం. ఇంజను పరశురామప్రీతి, యింజను వెనుకనున్న రెండు పెట్టెలు పూర్తిగా విధ్వంసం. వాటిలో ఒకటి మిలిటరీ కంపార్టుమెంటు. ఆ పెట్టెల్లోనివారంతా పూర్తిగా మరణించారు...

విశ్వనాథం అయిదోసారి కూడా అంతవరకే చదవగలిగేడు. ఎందుకంటే నాగులు బావెక్కిన రైలదే-పగటి చివరికి బెజవాడొస్తుంది.

తీరని జాలితో హృదయం రెపరెప లాడుతోంది.

మనస్సులో మహారణ్యాంతగలబడిపోతోంది.

దిగిపోయే సూర్యుడి వేపు దీనంగా చూసేడు మునిమాపుకింకా వేళకాలేదు.

పాలపిట్ట రంగు కోక ధరించిన కనకాలు పాలపిట్టలాగే ఎగురుతూ పోతోంది. దాని మనస్సులోనూ చల్లటి సాయంత్రపు వెలుగు నిలిచేవుంది—అప్పుడే ప్రొద్దు వాటారదు.

ఇంకా వ్యవధి వుంది—మూడుమైళ్ళసేపు బెజవాడ చేరేదాకా.

దూరంగా బొగడచెట్టుమీద, బూడిద చిలక చిలకరిస్తున్నట్లు గువ్వలు వాలుతున్నాయి.

తన సానుభూతికి ఆలస్యం లేకపోయినా, కనకాలు కష్టానికి మాత్రం కొన్ని నిమిషాల ఆలస్యమైనా వున్నందుకు - తొందరగా చీకటి పడిన విశ్వనాథం మనస్సులో ఒక సన్నటి వెలుగురేఖ ఏదో వినూత్నంగా వెలిగి చెదిరింది.

చివరిసారిగా విశ్వనాథం చివరికంటా చూసేడు.

కాసేపు తీగెల్ని కంగారుగా తప్పించుకుంటూ కనకాలింకా పరుగుతెడుతోంది.

★